# సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [7]

~ అద్దంకి అనంత రామయ్య



**సీరియల్:** సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [7]

**రచన:** అద్దంకి అనంత రామయ్య

**ప్రచురణ:** కినిగె పత్రిక patrika.kinige.com

**కాలం:** ఫిబ్రవరి 2014

**శాశ్వత లింకు:** http://patrika.kinige.com/?p=1741

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**

Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [7]

*అత్యధికంగా అమ్ముడుపోయిన ఈ-పుస్తకంగా పేరు తెచ్చుకున్న "రామ్@శృతి.కామ్" రచయిత అద్దంకి అనంతరామయ్య రాసిన రెండవ హాస్య నవల ఈ "సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం". దీన్ని వారం వారం సీరియలైజ్ చేస్తున్నాం.* ***ఇది ఏడవ భాగం.***

దీని ముందుభాగం

సోమవారం ఉదయం , ఏ ఒక్కళ్ళకి నచ్చని సమయం. రవి వారం తరువాత రోజు, బహుశా ఆ రవికి కూడా సోమవారం ఉదయం అంటే చికాకు కాబోలు. ఆ సంగతి అవునో కాదో తెలియదు కానీ సాఫ్టోళ్ళకి మాత్రం అది ముమ్మాటికి నచ్చని సమయం. ఉదయాన్నే ఊరి నుంచి బస్సు దిగిన అజయ్, కార్యాలయానికి చేరుకున్నాడు. కొండంత పనిని, కొండమీద కోతి లాంటి మేనేజర్ ని తలచుకొని మొదటిసారి బాధపడ్డాడు(ఆ రోజుకి). పలహారం తినటానికి సమాయత్తం అయ్యాడు.

"వీకెండ్ ఎలా జరిగింది అజయ్ ?" అని అడిగాడు డాలర్ బాబు. "ఊరికి వెళ్లి ఇందాకే వచ్చాను. నీ వీకెండ్ ఎలా జరిగింది ఆ నాలుగు ఇంగులు కాకుండా?" అని అజయ్ అడగటంతో డాలర్ బాబు నవ్వాడు. సాధారణంగా పెళ్లి కాని టెక్కీలు వీకెండులో నాలుగు ఇంగులు చేస్తుంటారు. మొదటిది అన్నింటికంటే సుఖమైనది స్లీపింగ్. వారం రోజులు, రోజుకు పద్దెనిమిది గంటలు పని చేస్తే వారాంతాలు పద్దెనిమిది గంటలు నిద్ర పోతుంటారు.

ఇక రెండోది చాటింగ్. ముఖ పుస్తకం వచ్చి జనాలు ముఖాలు చూసుకోవటం మర్చిపోయాక, వారాంతాలు ఎక్కువగా చేసేపని స్నేహితులతో కలిసి చాటింగ్ చేయటం సాధారణమైన విషయం. ఇక మూడో 'ఇంగు' షాపింగ్. జీవితంలో వాకింగ్ చేయకపోతే ఆరోగ్యం పాడవుతుందో లేదో తెలియదు కానీ ,వీళ్ళు నెలలో ఒక్కసారైనా షాపింగ్ చేయకపోతే, కార్డు గీకకపోతే మాత్రం ఖచ్చితంగా ఆరోగ్యం దెబ్బతింటుందనటంలో సందేహం లేదు. శాస్త్రం లో ఏమి చెప్పారంటే జాగృతి ,స్వప్న ,సుషుప్తి అనే మూడింటిని దాటితే తురీయం లోకి వెళ్తారట ! అలానే పైన చెప్పిన మూడు ఇంగులు అయిపోతే ,ఇక

తురీయం అనే నాలుగో ఇంగ్ లోకి వెళ్తారు. అదే నత్తింగ్. స్లీపింగ్ ,చాటింగ్ ,షాపింగ్ మూడు కుదరకపోతే ,ఖాళీ గా కూర్చొని చేసేదేమీ లేక మిగిలేది నత్తింగ్.

అజయ్,డాలర్ బాబు కలిసి తినటానికి ఆఫీసులోకి మరో అంతస్తు లో ఉన్న క్యాపెటేరియాకు వెళ్లారు. ఇడ్లీ కి డబ్బులు కట్టి ,అవి తెసుకోవటానికి వెళ్లారు. “గుంటూరు ఇడ్లీ” అని రాసి ఉండటం చూసి ఇద్దరూ ఆనందించారు. మంచి టిఫిన్ దొరుకుతుందని. తీరా ఇడ్లీలు గట్టిగా, గడ్డల్లా ఉండటం చూసి డాలర్ బాబుకి మండి పోయింది. అక్కడి పని చేసే అతన్ని పిలిచి “ఏంటివి?” అని అడిగాడు. “గుంటూరు ఇడ్లీ సార్!” అన్నాడు నవ్వుతూ. “నేను పాతికేళ్ళు గుంటూరులో ఉన్నాను. ఇవి గుంటూరు ఇడ్లీ కాదు.అస్సలు వీటిని గుంటూరులోనే కాదు, అమెరికాలో కూడా ఇడ్లీలు అనరు. ఇడ్లీలైనా మార్చు, పేరైనా మార్చు” అని వెళ్లి, తిట్టుకుంటూ తిన్నారు. “మానేజర్ రాజా ఏమన్నాడు. నేను లేని రెండు రోజులు కొత్తగా ఏమైనా జరిగాయా?” అడిగాడు అజయ్ డాలర్ బాబుని. “బాబుకు పాపల్ని పట్టించుకోవటానికే సమయము సరిపోవటం లేదు. ఇంకా మిగతావేమి పట్టించుకుంటాడు? అందునా గీత రెండు వారాలు రాదనే విషయాన్ని జీర్ణించుకోలేక పోతున్నాడు” అన్నాడు డాలర్ బాబు. “బాగా అల్లపు పచ్చడి తినమను, అదే జీర్ణం అవుతుంది” అన్నాడు అజయ్.

తిని ఎవరి పనుల్లో వాళ్ళు మునిగి పోయారు. వారాంతం వచ్చేదాక అలా మునిగే ఉన్నారు. హైదరాబాద్ ఇనార్బిట్ మాల్ ,అజయ్ నిషా వారాంతాలలో తిరిగే ప్రదేశాల్లో ముఖ్యమైనది. ప్రతిసారి సరదాగా సాగే వీళ్ళ వారాంతం, ఈ సారి మాత్రం ఒక సమస్యతో సాగింది. “నాన్న పెళ్లి సంబందాలు చూస్తున్నారురా” అన్నది నిషా నీరసంతో. “మన సంగతి చెప్పావా?” అడిగాడు అజయ్. “చెప్పాను” అని తల ఊపింది. ముందు అరిచారు, తరువాత విన్నారు, చివరగా నిన్ను రమ్మన్నారు” అన్నది. “అయితే ఎప్పుడు వెళ్ళమంటావు?” అని అడిగాడు అజయ్. తీవ్ర తర్జన భర్జనల తరువాత పంచాంగంతో పని లేకుండా ముహూర్తం ఖరారు చేసుకున్నారు. “నేను వచ్చే వారం ఎలాగూ ఇంటికి

వెళ్తున్నాను, నువ్వు కూడా అప్పుడు వచ్చి మాట్లాడితే, నేను కూడా ఇంట్లో ఉంటా కదా!" అన్నది . సరే అనుకుని అక్కడనుంచి సర్దుకున్నారు.

అజయ్ ఆ వారమంతా నిషా వాళ్ళ నాన్న ఏమంటాడో, ఎలా ఒప్పించాలో అని తెగ ఆలోచించాడు. ఆరోజు రానే వచ్చింది. అజయ్ తన స్నేహితుడు డాలర్ బాబును వెంటబెట్టుకుని నిషా వాళ్ళ ఊరు బయలుదేరాడు. తను బయలుదేరిన సంగతి అప్పటికే, ఊరు చేరిన నిషాకి చెప్పాడు. అజయ్ లో ఉత్కంఠ ఎక్కువైపోయింది. బస్సు ఎక్కిన కాసేపటికి సెల్ ఫోనులో పాటలు పెట్టి, సీటులో వెనుకను వాలి కిటికీలో నుంచి బయటకు చూస్తూ కూర్చున్నాడు. చెట్లతో ,పుట్లతో పాటు కాలం కూడా వెనక్కు వెళ్ళింది. అజయ్ తన ప్రేమ పుస్తకంలోని పేజీలన్నింటిని తిప్పుతూ కూర్చున్నాడు. మెల్లగా నిద్రలోకి జారుకున్నాడు.

నిద్రకు మూడు ఉపాయాలు, ఒకటి పాటలు వినటం, రెండు పుస్తకంలో పేజీలు తిప్పటం, మూడు పంతులుగారు పాఠం చెప్పటం. వారం రోజులనుండి సరిగ్గా నిద్రపోకపోవటంతో, గాఢనిద్ర లోకి వెళ్ళిపోయాడు. మూడు గంటల తర్వాత బస్సు ఆపటంతో, మెళకువ తెచ్చుకున్నాడు. "భలే నిద్ర పట్టేసింది రా!" అని ఒళ్ళు విరిచాడు డాలర్ బాబు. "ఏంటి సార్ బస్సు ఇక్కడ ఆపారు?" అని అడిగాడు డాలర్ బాబు, డ్రైవరుని. "ఇంజిన్ బాగా వేడెక్కింది, నీళ్ళు పోయటానికి ఆపాము" అనటంతో డాలర్ బాబు అవాక్కయ్యాడు. "ఈ కాలంలో కూడా ఇలాంటి బస్సులు వాడుతున్నారు, అదే అమెరికాలో" అని అంటుండగా, అజయ్ అసహనంగా చూడటంతో అక్కడితో ఆ మాటను ఆపేశాడు. "మీ మామ దయవల్ల ఈ బస్సు లాగే నీ ప్రేమ కూడా మంచి వేడి మీద ఆగింది.నువ్వు నీళ్ళు చల్లగలిగితే మళ్ళీ ప్రయాణం సాగుతుంది" అన్నాడు డాలర్ బాబు. అవునన్నట్టు తల ఊపాడు అజయ్.

"ఇంతకీ ఏమి మాట్లాడాలో ఏమైనా అనుకున్నావా?" అని అడిగాడు ఒక్కింత ఆతృతతో. అజయ్ ఏమీ మాట్లాడలేదు. "ఇది కూడా ఇంజనీరింగ్ పరీక్ష లాగే ఉన్నది కదా!" అన్నాడు డాలర్ బాబు. "నిజమేరా! కాకపోతే ఇక్కడ సిలబస్సే అర్థం కావటం లేదు" అంటూ దిగులుపడ్డాడు అజయ్.

“అ మాత్రం దానికే భయపడితే ఎలా ? ఇంజనీరింగ్ అంతా మనం సిలబస్ తీసి, చూసి, చదివే రాశామా పరీక్షలు? ఇది కూడా అంతే! ముందు హై కమాండ్ కొరికలేంటో తెలుసుకో ,దానిని బట్టీ పెళ్ళికి ముందుకి పోవాలో ,పిల్లని లేపుకు పోవాలో ఆలోచిద్దాము” అన్నాడు డాలర్ బాబు. ఇంతలో బస్సు మళ్ళీ బయలుదేరింది.

“ఎలాంటి ప్రశ్నలు ఎదురుకావచ్చు? ఏ ప్రశ్న వేస్తే ఏ సమాధానం చెప్పాలో ఇద్దరూ కలిసి చర్చించారు. ఒకరికొకరు జ్ఞాన బదిలీలు చేసుకున్నారు. ఇలా కొన్ని గంటల ప్రయాణం తరువాత ,ఇద్దరు నిషా ఊరు చేరారు. ఊరిలో దిగగానే ,అజయ్ నిషాకి ఫోను చేశాడు. “అన్న, నేను నిషా అక్కకి తమ్ముడిని, మీరు ఎక్కడున్నారు?” అని ఒక కుర్రవాడి గొంతు వినిపించింది. “వీడెవడురా? తనని అక్కని ,నన్ను అన్న అంటున్నాడు?” అని చిరాకుగా ముఖం మర్చి ఫోను డాలర్ బాబు చేతికి ఇచ్చాడు. “మేము బస్టాండ్ లో ఉన్నాము” అని డాలర్ బాబు చెప్పాడు. కాసేపటికి ఒక కుర్రవాడు వచ్చి “మీరేనా అజయ్” అని అడిగాడు. అజయ్ అవునన్నాడు. “ అక్క మిమ్మల్ని ఇంటికి తీసుకొని రమ్మన్నది” అని చెప్పాడు. ముగ్గురూ కలిసి ఆటోలో బయలుదేరారు. “ఏమి చదువుతున్నావు ?” అని అడిగాడు అజయ్. “ ఇంటర్ అన్నా” అన్నాడు ఆ అబ్బాయి. “నీ ప్రేమానురాగాలు పాడుగాను, అన్న అనే పదం లేకుండా అన్నం కూడా తినేట్టు లేవు” అన్నాడు అజయ్. ఏమీ అర్థం కానట్టు ముఖం మార్చాడా కుర్రాడు.

నేరుగా ఒక వీధి చివర ఆటోని ఆపమన్నాడు. “ఇక్కడనుండి అక్క నడుచుకుంటూ రమ్మన్నది” అన్నాడు. “నాకైతే, మనమేదో నిధి వేటకు వెళ్తున్నట్టుగా ఉన్నది” అన్నాడు డాలర్ బాబు. “ అలాంటిదే కదా! ఇంచుమించు” అన్నాడు అజయ్. “ బాబు, నిషా అక్క నీకెలా అక్క ?” అడిగాడు డాలర్ బాబు. “ మాకు చుట్టాలవుతారు. మా ఇంటి పక్కనే అక్కా వాళ్ళ ఇల్లు” అని చెప్పాడు. “మీ అక్క వాళ్ళ నాన్న మంచోడేనా?” అడిగాడు డాలర్ బాబు. “అమ్మో ఆయనంటే నాకు చచ్చేంత భయం” అన్నాడు. “ఐతే, మేము తిరిగి వెళ్ళిపోయాక, మమ్మల్ని దగ్గరుండి తీసుకొచ్చింది నువ్వే అని చెప్పు, అంకుల్ నిన్ను తెగ మెచ్చుకుంటాడు” అనటం తో అజయ్ డాలర్ బాబు వైపు కోపంగా చూశాడు. “ ఏంటి రా కోపంగా



ఉన్నావు?" అన్నాడు డాలర్ బాబు. "అది కోపం కాదురా భయం" అన్నాడు అజయ్. "బాబు మీ పెదనాన్నంటే నీకే కాదు, హైదరాబాదులో అందరికీ భయమే. కావాలంటే ఇతడే సాక్ష్యం" అన్నాడు. అజయ్ నవ్వే పరిస్థితుల్లో లేడు. "అదుగో ఆ నాలుగో ఇల్లే ,నేను రాను మీరు వెళ్ళండి" అని చెప్పాడా కుర్రాడు. " సరేరా , ఆల్ ది బెస్ట్" అని డాలర్ బాబు చెప్పి అజయ్ ని పంపాడు. "పద తమ్ముడు కాసేపు మనం అలా తిరిగొద్దాము" అని అనటంతో ఇద్దరూ అక్కడే ఆగిపోయారు.

అరగంట తర్వాత అజయ్ నీరసంగా బయటకు వచ్చాడు. వీధి చివర వరకూ వచ్చి, డాలర్ బాబు కు ఫోన్ చేశాడు. ఇద్దరు కలిసి మళ్ళీ బస్టాండ్ కు తిరుగు ముఖం పట్టారు. "ఏ గుడి మాట్లాడమంటావు?" అని అడిగాడు, అజయ్ ముఖంలో నీరసాన్ని గమనించిన డాలర్ బాబు. "చూద్దాం" అన్నాడు అజయ్. "ఇంతకీ లోపలేమి జరిగింది?" అని అడిగాడు డాలర్ బాబు. "ఏముంది? నేను ప్రేమ అన్నాను, కుదరదు అన్నారు. పెళ్లి భోజనం అన్నాను, పురుగుల మందు అన్నారు" అన్నాడు అజయ్. "ఓహో చస్తామని బెదిరించారన్నమాట" అని డాలర్ బాబు అనటంతో అవునన్నట్టు తల ఊపాడు అజయ్.

"నువ్వు ప్రేమకోసం ప్రాణాలు ఇవ్వటానికైనా సిద్ధమన్నావు,వాళ్ళ అమ్మా నాన్న ప్రాణాలు కాదు కదా" అన్నాడు. అజయ్ ఏమీ మాట్లాడలేదు. "ఇందుకేరా, నాకీ దేశం నచ్చనిది. ఇదే అమెరికాలో అయితే, ఈ పాటికి నీకు పెళ్ళితో పాటు విడాకులు కూడా ఎప్పుడో అయ్యేవి" అని డాలర్ బాబు అన్నాడు. ఇద్దరూ బయలుదేరి తిరిగి హైదరాబాద్ చేరారు. పెద్దవాళ్ళు అర్థం చేసుకోని ప్రేమను తలుచుకొని పదే పదే బాధ పడ్డాడు.

అజయ్ కి ఉద్యోగంలో కూడా కష్టాలు మొదలయ్యాయి. కష్టాల వల్ల కలిగే భాద కన్నా, భయమే ఎక్కువ ఉంటుంది. అజయ్ కి ఆ భయమే మొదలయింది. తన ఉద్యోగం ఊడుతుందేమో అని. తానొకటి తలిస్తే, అప్పుడప్పుడు దైవం కూడా అదే తలుస్తుంది. అనుకున్నట్టు అజయ్ ఉద్యోగానికి ప్రమాదం ఏర్పడింది. అస్సలే మాంద్యం, ఆ పైన మానేజరుతో గొడవ ఉండనే ఉన్నది. ఆ కారణంతో అజయ్ కి ఉద్యోగం పోవటం మరింత సులభం అయ్యింది. అజయ్ కి ఇది పెద్ద దెబ్బ.

“పడిలేవటం ప్రకృతి ధర్మం”. మనుషులు ప్రకృతిలో భాగమే! అలాంటి మనుషులు చేసే ఉద్యోగాలు కూడా ప్రకృతిలో భాగమే. ఆ ప్రకృతిలో భాగం గానే ఆర్థిక మాంద్యం కారణంగా సాఫ్ట్ వేర్ ఇండస్ట్రీ పడిపోవటం ప్రారంభం అయ్యింది. అది మళ్ళీ లేచే దాక ఉద్యోగం కాపాడుకోవటానికి అందరూ విశ్వప్రయత్నం చేయటం మొదలు పెట్టారు. కంపెనీలు అక్కర్లేని ఖర్చులను తగ్గించుకునే పనిలో పడ్డాయి. ముందుగా పని లేక బల్లమీద కూర్చునే వాళ్ళకి కనీసం నిలబడే అవకాశం కూడా ఇవ్వకుండా తీసేశారు. ఉద్యోగులకు కార్లను ఇంటికి పంపటం ఆగిపోయింది. ఎక్కడ విన్నా ఉద్యోగం పోయిందన్న మాటే తప్ప, వచ్చింది అని వినపడటం లేదు. ప్రతి ఉద్యోగి సాటి ఉద్యోగిని జాలిగా చూసుకుంటున్న రోజులు. ఇంకా చెప్పాలంటే, సాఫ్ట్ వేర్ ఉద్యోగులమీద జోకులు మొదలైన రోజులవి! బ్యాంకులు క్రెడిట్ కార్డులను ఆపేశాయి.

ఉన్న ఉద్యోగాలనే ఊడదీస్తున్నారు, ఇంక క్రొత్త ఉద్యోగాల ఊసే లేకుండా పోయింది. తెలిసిన వాళ్ళనీ, తెలియని వాళ్ళనీ అడిగి చూశాడు, ఏ మాత్రం లాభం లేక పోయింది. మళ్ళీ తండ్రిని ఇంటి దగ్గర నుండి డబ్బులు పంపమనే రోజులు వచ్చాయి అజయ్ కి.

ఒక రోజు ఉదయాన్నే నిషా, అజయ్ కి ఫోను చేసింది. “ఎక్కడున్నావ్?” అని అడిగింది. “ఆన్ లైన్ లో ఉన్నా” అని చమత్కరించాడు అజయ్. “ఒకసారి నీతో ముఖ్యమైన విషయం మాట్లాడాలి”, “చెప్పు”, “ఫోనులో కాదు నేరుగా మాట్లాడాలి” అని నిషా అనటంతో, ఇద్దరూ హైటెక్ సిటీలో గల ఇనార్బిట్ మాల్ లో కలుసుకోవాలి అనుకున్నారు.

[తరువాయి భాగం వచ్చే వారం]

For Latest Telugu Books - Visit now:
Kinige
.com